ప్రజా విజయోత్సవాలను జయప్రదం చేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్, నవంబర్ 23: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కాబోతున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నేడు నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాలను జయప్రదం చేయాలని శనివారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు.

నేడు నియోజకవర్గంలో మంత్రి పర్యటన

నేరేడుచర్ల: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చింతపాలెంలో తాసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు మేళ్లచెర్వు టు చింతలపాలెం రోడ్డు పనులు ప్రారంభించను న్నారు. అనంతరం చింతలపాలెం నుంచి కిష్టాపురం చేరుకొని రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత మఠంపల్లి టు హుజూర్‌నగర్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నేడు నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీ నాగేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు అందజేత

పెన్‌పహాడ్, నవంబర్ 23: మండల పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ రవి చేతుల మీదుగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఏ వప్రంనాయక్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ప్రభాకర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సంద్యాల వినోద్, నల్ల శ్రీనివాస్, శివశంకర్, గవాస్కర్, జమాల్, అల్లాడి సత్యనారాయణ, కృష్ణయ్య, శ్రీకాంత్, శైలజ, రేణుక, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, నవంబర్ 23: కీతవారిగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సకృనాయక్, ఇన్‌చార్జి ఏఈ భూక్య వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం గరిడేపల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. కీతవారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కీతవారిగూడెం, వెలిదండ, రంగాపురం, సర్వారం, కట్టకొమ్ముతండా, లక్ష్మీపురం, రాయినిగూడెం, కాల్వపల్లి, కొత్తగూడెం, మంగాపురం, తాళ్లమల్కాపురం, కట్టవారిగూడెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోదాడ రూరల్: చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టనున్నందున పట్టణ పరిధిలోని తమ్మర ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సైదులు శనివారం తెలిపారు.

ఎన్యూమరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గరిడేపల్లి, నవంబర్ 23: ఇంటింటికీ తిరగకుండా, ఒకేచోట కూర్చొని కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌పై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని పొనుగోలు గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం పొనుగోడులో అంగన్‌వాడీ టీచర్ ఇంటింటికి తిరగకుండా, ఒకరి ఇంట్లో కూర్చొని అందరినీ అక్కడికే పిలిపించుకొని వారు చెప్పిన వివరాలనే నమోదు చేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి ఎన్యూమరేటర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఇంటింటి సర్వే డాటా ఎంట్రీ పరిశీలన

మఠంపల్లి, నవంబర్ 23: మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటి సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా డాటా ఎంట్రీ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి

- ధర్మ జాగరణ సమితి తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నేరేడుచర్ల, నవంబర్ 23: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని ధర్మ జాగరణ సమితి తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు శ్రీరామచంద్రుని శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బక్కయ్యగూడెం, మేడారం, ఫత్తేపురం, నేరేడుచర్లలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ చైతన్య రథయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందువులను విడగొట్టి సనాతన ధర్మాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకు కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. ఈ రథయాత్రలో లక్ష్మయ్య, అప్పయ్య, రాచకొండ శేఖర్, రాచకొండ శ్రీనివాస్, వీరయ్య, నటరాజ్, మోహన్, రాము, శంకర్ రెడ్డి, శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ రెడ్డి, వాసు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ

మేళ్లచెర్వు, నవంబర్ 23: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న చింతలపాలెం కస్తూర్బా పాఠశాలకు డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ టీషర్ట్స్, సౌండ్ సిస్టమ్ బహూకరించారు. కార్యక్రమంలో చింతలపాలెం, మేళ్లచెర్వు ఎంఈవోలు శ్రీనివాస్, వెంకటరెడ్డి, మేళ్లచెర్వు ఎస్సై పరమేష్, డీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అంబేద్కర్, బోగాల బాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నడిగూడెం, నవంబర్ 23: సిరిపురం హైస్కూల్‌లో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు, పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ఏఈఓ ఉపేందర్‌రావు, ఎంపీడీఓ ఇమామ్, పంచాయతీ కార్యదర్శి ఆర్.సతీష్‌కుమార్, ఎంఈఓ ఉపేందర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

నడిగూడెం: సిరిపురం పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఉపేందర్‌రావు

నడిగూడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంఈఓ ఉపేందర్ రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఇమామ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తాసీల్దార్ ఆగ్రహం

నడిగూడెంలోని బీసీ బాలికల హాస్టల్‌ను శనివారం రాత్రి తాసీల్దార్ సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, స్టోర్ గదిని, టాయిలెట్స్ పరిశీలించారు. తనిఖీ సమయంలో వార్డెన్ లేకపోవడంతో విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. బాత్రూమ్స్‌లో లైట్స్ లేకపోవడంతో పాటు విద్యార్థులకు వండిన వంటకాలు సరిపోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో వార్డెన్ గైర్హాజర్‌పై, భోజనం తక్కువైన విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తాసీల్దార్ తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ గోపాల్‌రావు ఉన్నారు.

నూతనకల్: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను తాసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ సునీత శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని వార్డెన్లకు సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

పెన్‌పహాడ్: ఇన్‌చార్జి తాసీల్దార్ ధరావత్ బాలునాయక్ అనాజిపురం మోడల్ స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సురక్షితమైన తాగునీరు అందించాలని సూచించారు. హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్ఐ రంజిత్‌కుమార్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

తిరుమలగిరి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని తాసీల్దార్ హరిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆర్ఐ మద్దూం, వార్డెన్ అంజయ్య పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

- పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల, నవంబర్ 23: సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ బలోపేతానికి పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని కోరారు. డిసెంబర్ 30న నల్లగొండలో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకల ప్రారంభ బహిరంగ సభ నిర్వహించనున్నందున, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మండవ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఊదర వెంకన్న, వెంకట్, భరత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబా జయంతి వేడుకలు

సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కోదాడ టౌన్, నవంబర్ 23: సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను స్థానిక ఆజాద్ నగర్‌లో గల సాయి మందిరంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్, విభూది పంపిణీ చేశారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మేళ్లచెర్వు నవభారతి పాఠశాల 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సహకారంతో అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఆదినారాయణరెడ్డి, సంగాని శ్రీను, మునగాల పాపిరెడ్డి, సత్యనారాయణ, రాధిక, సునీత, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అనఘాష్టమి వ్రతం

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శనివారం భక్తులు అనఘాష్టమి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనఘాదేవి సమేత అనఘస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. సకల దోషాలు తొలగిపోతాయని భక్తులు ఈ వ్రతాన్ని ఆచరించారు. పూజారులు విశ్వేశ్వరశర్మ, గంగాధర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే స్వామివారి పవిత్రోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు, ఈఓ వెంకటనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

నృసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి: మండల పరిధిలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుని నిత్యకల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

ట్యాగ్ నిబంధనతో రైతులకు ఇబ్బందులు

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్

కోదాడ రూరల్, నవంబర్ 23: సరిపడా ట్యాగ్‌లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ట్యాగ్‌లతో సంబంధం లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని తమ్మర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కొనుగోలు చేసిన ప్రతి సన్నరకం ధాన్యం బస్తాకు ట్యాగ్ వేయాలని ప్రభుత్వం నిబంధనలు విధించిందని, అయితే, సరిపడా ట్యాగ్‌లు రాక కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు గుట్టలుగా పేరుకుపోయాయని తెలిపారు. ఈ నెల 26 నుంచి తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి సరిపడా ట్యాగ్‌లు సరఫరా చేయాలని అన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్ల, నవంబర్ 23: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్, మండల ప్రధాన కార్యదర్శి యల్లబోయిన లింగయ్య, నాయకులు సుదర్శన్, పిచ్చిరెడ్డి, హుస్సేన్, ఉపేందర్, రాజేష్, గురవయ్య, భాస్కర్, రామస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదాడలో సర్వ బ్రాహ్మణ కార్తిక సమారాధన

కోదాడ, నవంబరు 23: కోదాడలోని బ్రాహ్మణ భవనంలో ఆదివారం సర్వ బ్రాహ్మణ కార్తిక సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం బాధ్యులు కొండపల్లి సింగయ్య, తుంగతుర్తి శేషగిరిరావు, మంత్రిప్రగడ శ్రీధర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న సర్వ బ్రాహ్మణులు ఇదే ఆహ్వానంగా భావించి కార్తిక సమారాధనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గౌడ వన భోజన మహోత్సవం

కోదాడటౌన్, నవంబర్ 23: కోదాడలో పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద గల ఒక తోటలో నేడు గౌడ కార్తిక వన భోజన మహోత్సవం నిర్వహిస్తున్నామని, గౌడ కులస్తులందరూ పాల్గొనాలని కమిటీ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

26న విశ్రాంత ఉద్యోగుల వన భోజనాలు

కోదాడ టౌన్, నవంబర్ 23: ఈ నెల 26వ తేదీన కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణ మామిడి తోటలో వన భోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కోదాడ యూనిట్ విశ్రాంత ఉద్యోగులు అందరూ హాజరు కావాలని కోరారు.

తమ్ముడిని చంపిన అన్న

గరిడేపల్లి, నవంబర్ 23: ఆస్తి విషయంలో వివాదం చెలరేగి సొంత తమ్ముడినే అన్న హతమార్చాడు. ఈ ఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నకిరేకంటి అంజయ్య అలియాస్ అంజి, సంజయ్ (26) అన్నదమ్ములు. ఇంటి స్థలం, వ్యవసాయ భూమి గురించి అన్నదమ్ములు, తండ్రి మాట్లాకుంటున్న క్రమంలో మాట మాట పెరిగి తమ్ముడైన సంజయ్‌ను అన్న అంజి రోకలి బండకర్రతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చలికంటి నరేష్ తెలిపారు.

రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చివ్వెంల, నవంబర్ 23: మండలంలోని మూన్యానాయక్ తండా శివారులో ఉన్న యువన్ కృష్ణ రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలని లంబాడీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ బాలునాయక్ శనివారం కాలుష్య నియంత్రణ మండలి అధికారి రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైస్ మిల్లు నుంచి వచ్చే దుర్గంధం, ధూళితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోతు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

కంది పంటల పరిశీలన

తిరుమలగిరి, నవంబర్ 23: మండల పరిధిలోని మాలిపురం గ్రామంలో శనివారం మండల వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు రాజు మృతి

సూర్యాపేటటౌన్, నవంబర్ 23: సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు తాళ్లపల్లి రాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు, జర్నలిస్టులు రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

3ఎల్ ప్రోగ్రామ్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

అర్వపల్లి, నవంబర్ 23: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 3ఎల్ (లాంగ్వేజ్, లాజిక్, లైఫ్ స్కిల్) ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. 3ఎల్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీదేవి, మధుకర్, విమల, ప్రసన్న, శ్రీరాములు, నాగన్న, సునంద, అంజలి, ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

నేరేడుచర్ల, నవంబర్ 23: నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల్లో పేషెంట్ల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నందున తనిఖీలు చేపట్టి ధరలను నియంత్రించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని కోరుతూ స్టాఫ్ నర్సు స్వాతికి వినతిపత్రం అందజేశారు. పేదలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ డివిజన్ కమిటీ అధ్యక్షురాలు చందనబోయిన లక్ష్మి, వాసా కరుణాకర్, సండే సత్యమ్మ, మరియమ్మ, శైలజ, రేష్మ, శ్యామల, పావని, మాలాంబి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై విచారణ

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీఓ సురేశ్‌రెడ్డి

అర్వపల్లి, నవంబర్ 23: మండల పరిధి బొల్లంపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో వీఏఓ ద్వారా అవకతవకలు జరిగాయంటూ గ్రామ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, శనివారం అదనపు డీఆర్‌డీఓ సురేశ్‌రెడ్డి విచారణ చేపట్టారు. రైతులను, సెంటర్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. డీపీఎం గోవింద్, ఏపీఎం మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించి బహుమతులు గెలుచుకోవాలి

- రీజనల్ డిప్యూటీ మేనేజర్ మాధవి

సూర్యాపేట అర్బన్, నవంబర్ 23: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడంతో పాటు బహుమతులు గెలుచుకోవచ్చని ఆర్టీసీ రీజనల్ డిప్యూటీ మేనేజర్ ఎస్.మాధవి అన్నారు. శనివారం సూర్యాపేటలోని ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్కీడ్రా ద్వారా ఎంపికైన మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేశారు. ఈ పందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలక్స్ బస్సులలో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ప్రతి 15 రోజులకు ఒకసారి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, విజేతలు పాల్గొన్నారు.

వైద్య పరిశోధన రంగాల్లో ఫార్మసీకి అగ్ర తాంబూలం

- క్లినిసాల్ రీసెర్చ్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ముజీబుద్దీన్

ముజీబుద్దీన్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సూర్యాపేట రూరల్, నవంబర్ 23: ఆధునిక కాలంలో వైద్య పరిశోధన రంగాల్లో ఫార్మసీ విద్యకే అగ్ర తాంబూలమని క్లినిసాల్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సీఎస్ ముజిబుద్దీన్ అన్నారు. శనివారం రాయిన్‌గూడెం సమీపంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ క్లినిసాల్ శిక్షణ సంస్థలో ప్రతి ఏటా రెండు వేల మంది ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అమెరికాలో చదువుతున్న భారతీయుల్లో ఇంజినీరింగ్ తర్వాత ఫార్మసీ విద్యార్థులే ఎక్కువగా ఉన్నారన్నారు. అనంతరం ముజీబుద్దీన్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫార్మసీ కళాశాలల సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.రామదాసు, ప్రిన్సిపాల్ ఆడెపు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్, పరిపాలనాధికారి దేవులపల్లి వినయ్‌కుమార్, డాక్టర్లు నీలమ్మ, స్వరూప, నరసింహారావు, నటేష్‌కుమార్, మహేష్‌కుమార్, నవీన్‌కుమార్, సుజాత, రాంబాబు, భవాని, శృతి, శైలజ, ప్రీతమ్, మల్లె లత, ఫర్హీన్, తులసి, లలిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

26న సూర్యాపేటలో మోటార్ సైకిల్ ర్యాలీ

-